క్లుప్తంగా

విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూస్తాం..

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని సబ్‌స్టేషన్లలో, ఫీల్డ్ వర్కర్లు మంగళవారం నుంచి సమ్మెలో పాల్గొన్నారని ఏఈ సూర్యం పేర్కొన్నారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రైవేట్ సిబ్బందితో విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. మండలంలో మొత్తం 26 మంది కార్మికులకు 21 మంది సమ్మెలో పాల్గొన్నారని, మరో అయిదుగురు విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్య ఉన్న ఆందోళన చెందకుండా పరిష్కరించుకోవాలన్నారు.

అమ్రాబాద్‌లో భారీ వర్షం

అమ్రాబాద్: మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆ వర్షంలోనే రెండు వేర్వేరు చోట్ల పిడుగులు పడి రెండు పశువులు మృతిచెందాయి. జంగంరెడ్డిపల్లికి చెందిన ఉదతనూరి లింగస్వామి తమ పశువులను వ్యవసాయ పొలంలో కట్టేసి ఉంచగా.. పిడుగుపాటుకు గురై రూ.40 వేలు విలువ చేసే పాడి ఆవు చనిపోయింది. అదేవిధంగా ఎల్మపల్లికి చెందిన ఎండీ తథహార్ తమ రెండు కాడెద్దులను గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో చెట్టుకు కట్టేసి ఉంచగా.. పిడుగుపాటుకు గురై అందులో రూ.60 వేలు విలువ చేసే కాడెద్దు మృతిచెందింది. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఊర్కొండ ఎస్‌ఐగా నరేష్

ఊర్కొండ: నూతన ఎస్‌ఐగా నరేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మణ్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ కాగా మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేటలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నరేష్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

సౌకర్యాలు కల్పించాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించాలని నాగర్‌కర్నూల్ జిల్లా జాతీయ ఉపాధిహామీ పథకం జిల్లా కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు జిల్లా అధికారికి వినతి అందజేశారు. బాలస్వామి, వెంకటయ్య, కృష్ణయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా పాలెం వాసి



కాశిరెడ్డి శశిధర్

బిజినేపల్లి: మండలంలోని పాలెంకు చెందిన కాశిరెడ్డి శశిధర్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులయ్యారు. ఆయనతో పాటు మరో ముప్పై మందితో కూడిన లిస్టును మంగళవారం హైకోర్టు ఉత్తర్వుల్లో వెల్లడించింది. అంతకు ముందుగా ఆయన హైకోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ లిస్టులో పాలెంకు చెందిన కాశిరెడ్డి శశిధర్‌రెడ్డి పేరు ఉండటంతో పాలెంలో ఆయనకు అభినందనలు తెలిపారు.

మొక్కల పెంపకంపై దృష్టిసారించాలి



వెల్దండ: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పెంచుతున్న మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. వర్షాకాలం నాటికి మొక్కలను పూర్తి స్థాయిలో పెంచి సిద్ధంగా ఉంచాలన్నారు. రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా పండ్లు, పూల, అలంకరణ మొక్కలను పెంచాలని సూచించారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఇంద్రకల్, లచ్చిరాం తండాలోని నర్సరీలను ఎంపీడీఓ గంగమోహన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు నర్సరీల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా నర్సరీలోని ప్రతి మొక్కను కాపాడాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి పని ప్రదేశాల వద్ద అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు.

పంట నష్టం అంచనాలో అధికారులు

బిజినేపల్లి: మండలంలో కురిసిన అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని తహసీల్దారు అంజిరెడ్డి, ఏఓ నీతి అంచనా వేశారు. మంగళవారం మండలంలోని మహదేవునిపేట, శాయిన్‌పల్లి, మమ్మాయిపల్లి, నందివడ్డెమాన్ గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, సపోటా, వంటి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈఓలు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



'మరోసారి విజయం మనదే'..

- బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

లింగాల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ముచ్చటగా మూడో సారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ గులాబీ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమని అన్నారు. సీఎం పాలనపై ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మాకం తిర్పతయ్య, హన్మంత్‌రెడ్డి, వెంకటగిరి, సుదీర్‌గౌడ్, రానోజీ, తిర్పతయ్య పాల్గొన్నారు.

నల్లమలను సస్యశ్యామలం చేస్తాం

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో ఉమామహేశ్వర, చెన్నకేశవ రిజర్వాయర్లను త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం అచ్చంపేట మండలం చెన్నారం సమీపంలో నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఆయన సతీమణి గువ్వల అమలను పూల వర్షంతో సాదరంగా సమావేశానికి కార్యకర్తలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచ స్థాయిలో తెలంగాణ ఖ్యాతి పెంపొందడం ఆనందదాయకమన్నారు. అంతకు ముందు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలు తీర్మానాలు చేశారు. మనోహర్, నర్సింహగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, తులసీరాం, రాంబాబునాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బీఆర్‌ఎస్ జెండావిష్కరణ

బీఆర్‌ఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు పలు మండలాల్లో, అచ్చంపేట పట్టణంలో పాల్గొని జెండాలను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, మనోహర్, రాజేశ్వర్‌రెడ్డి, విష్ణుమూర్తి, విష్ణువర్ధన్ రెడ్డి, లోక్యానాయక్ పాల్గొన్నారు.

బీజేపీ చర్యలను ఎండగడుదాం

కల్వకుర్తి: కత్తిగట్టి రాష్ట్ర ప్రయోజనాలకు అడుగడుగునా అడ్డుతగులుతున్న బీజేపీ విధానాలను కార్యకర్తలంతా ఎండగట్టాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని బాలరాంనగర్, శివాజీ చౌక్‌లో పార్టీ జెండాల ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మరో సారి బీఆర్‌ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా అవతరించి ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపడతారని అన్నారు. ఎడ్మ సత్యం, శ్రీశైలం, షాహేద్, బోజిరెడ్డి, సూర్యప్రకాశ్‌రావు, మధు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

బీఆర్‌ఎస్ జెండావిష్కరణ



పెంట్లవెల్లిలో జెండా ఆవిష్కరణ చేస్తున్న మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఊర్కొండ మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. వీరారెడ్డి, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, గిరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాలు ఎగురవేశారు. గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

తాడూరు మండల కేంద్రంలో మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద పార్టీ జెండాను గ్రామ అధ్యక్షుడు వస్పరి శేఖర్ జెండాను ఆవిష్కరించారు.

పెద్దకొత్తపల్లి, మారేడుమాన్‌దిన్నె, ముష్టిపల్లి, కల్వకోల్, జొన్నలబొగుడ, మండల కేంద్రంలో టీఆర్‌ఎస్ పార్టీ జెండాలను ఎగురవేశారు.

కోడేరు మండల కేంద్రంతో పాటు మాచుపల్లి, జనుంపల్లి, తీగలపల్లి, నర్సాయిపల్లి తదితర గ్రామాల నుంచి కొల్లాపూర్‌లో నిర్వహించిన ప్లీనరీ సభకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తరలివెళ్లారు.

– 'సాక్షి' నెట్‌వర్క్

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



లింగాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అచ్చంపేట రూరల్: దోమ కాటుతో మలేరియా వస్తుందని, మలేరియాతో అప్రమత్తంగా ఉండాలని సిద్దాపూర్ వైద్యుడు బిక్కులాల్, డివిజన్ ఉప మలేరియాధికారి అశోక్‌ప్రసాద్ కోరారు. మంగళవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా అచ్చంపేటలో వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమల, బాలీశ్వరి, శాంత తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్‌లో...

మండల కేంద్రంలో మంగళవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ప్రశాంతి, విజయ్‌కుమార్, శాంతాబాయి పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల వెంట ర్యాలీ నిర్వహిస్తూ.. మలేరియా సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ స్వప్న, సిబ్బంది మురళి, కవిత, మనోజ్, మధు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉప్పునుంతల: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఉప్పునుంతల మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి సంక్రమణ, వ్యాధి నిరోధక చర్యలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి స్వప్న, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, శంకరమ్మ, ఫార్మసిస్టు శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్, వటువర్లపల్లి గ్రామాల్లోని పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో మలేరియా నివారణ ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు సుధాకర్, అభిలాష్, శివాణి, భాగ్యమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అంబట్‌పల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. శివకుమార్, సంతోష్ పాల్గొన్నారు.

శాంతియుత నిరసనకు సహకరించండి



బిజినేపల్లిలో వినతి అందజేస్తున్న కార్యదర్శులు

వెల్దండ: సమ్మెకు అనుమతుల కోసం వెల్దండ తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ శ్రీనివాస్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యదర్శుల మండల అధ్యక్షులు ఫయాజ్, సురేందర్‌రెడ్డి, ప్రదీప్, అల్తాఫ్, స్వప్న, నవనీత, మంజుల, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల కమిటీ పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శాంతియుత నిరసన చేపట్టనున్నామని, అందుకు ఉన్నతాధికారులు తమకు సహకరించాలని మండల పంచాయతీ కార్యదర్శులు వినతి అందజేశారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 28 నుంచి చేపట్టే సమ్మె నోటీసులు మంగళవారం తహసీల్దార్ కార్తీక కుమార్‌కు అందజేశారు. లక్ష్మణ్, వీరాచారి, మౌనిక, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండ: తమ సమస్యలు పరిష్కరించేందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతామని జూనియర్ కార్యదర్శులు మంగళవారం ఎస్‌హెచ్‌ఓకు సమ్మెనోటీసు అందజేశారు. హరీష్, వివేక్, వెంకటేష్, వాణి, వి.దివ్య, శ్రీను పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న అంతటి కాశన్న

నాగర్‌కర్నూల్ రూరల్: కుంచెరుకలి కుటుంబంలో పుట్టి అత్యంత వెనుకబడి జీవిస్తున్న వారికి ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఆర్థికంగా ఆదుకోవాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న మాట్లాడారు. జిల్లా కేంద్రంలో 30 ఏళ్లుగా నివాసం ఉంటూ.. ఓటు హక్కు కలిగి ఆధార్‌కార్డు కలిగిన కుంచెరుకలి కుటుంబాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సారథి, శంకర్, మహేశ్, సాయిరాం, కోటేశ్వర్, శంకుతలమ్మ పాల్గొన్నారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: అన్ని రకాల హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్ డిమాండ్ చేశారు. 29న నిర్వహించే లేబర్ కార్యాలయ ముట్టడి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 50 ఏళ్లు పైబడిన హమాలీలందరికి ప్రతినెల రూ.6 వేల పింఛన్ ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కృష్ణయ్య, వెంకటయ్య, నర్సింహ, మల్లేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కవుల జీవితాలు విద్యార్థులతో చదివించాలి



అక్షర శిల్పులు గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కందనూలు: తెలుగు సాహిత్య రంగానికి తమ విలక్షణమైన రచనల ద్వారా విశిష్ట సేవలు అందించిన కవుల జీవిత చరిత్రలను విద్యార్థులతో ఉపాధ్యాయులు చదివించాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ సూచించారు. మంగళవారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ గౌరవ సలహాదారులు కవి రచయిత వేదార్థం మధుసూదన శర్మ రచించిన అక్షర శిల్పులు గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు వ్యాసాలు రాయడం, ప్రాజెక్టు పనులు, పుస్తక సమీక్షలు మొదలైనవి సులభంగా చేసేందుకు ఉపయోగపడేలా ఈ గ్రంథాన్ని రచించారని అన్నారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాగర్‌కర్నూలు జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, శ్రీనివాసులు గౌడ్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

అమ్రాబాద్: అంతర్జాతీయ పుస్తకాల దినోత్సవాన్ని మంగళవారం అమ్రాబాద్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ నల్లమల కింగ్స్ అమ్రాబాద్, క్లాస్‌మేట్ క్లబ్ అచ్చంపేట సంయుక్త ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. వెంకటరమణ, సంబు శోభ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌కు తరలిన బీజేపీ శ్రేణులు



నిరుద్యోగ మార్చ్‌కు తరలుతున్న బీజేపీ శ్రేణులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన నిరుద్యోగ మార్చ్‌కు బీజేపీ నాయకులు తరలివెళ్లారు. కొండా నాగేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి వెళ్లారు.

లింగాల: నిరుద్యోగ మార్చ్‌కు లింగాల మండలం నుంచి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

బిజినేపల్లి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి, నాయకులు కొండ నాగేష్, భూషయ్య, తదితరులు నిరుద్యోగ మార్చ్‌కు తరలివెళ్లారు.

సుప్రీకోర్టు తీర్పును అమలు చేయాలి

కల్వకుర్తి రూరల్: సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు గ్రాట్యుటీ వెంటనే ఇవ్వాలని మంగళవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీడీపీఓకు వినతి అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మానమ్మ మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులను కార్మికులుగా గుర్తించి గ్రాట్యుటీ చెల్లింపు చట్టం 1972 అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆంజనేయులు, పుష్పలీల, మహాలక్ష్మి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

కొల్లాపూర్: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లను గ్రాట్యుటీ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరమణకు వినతి అందజేశారు. నీరజ, వరలక్ష్మి, భాగ్యమ్మ, లలిత, దర్జీబాయ్, శ్యామల పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి: ఐదుగురిపై కేసు నమోదు

బల్మూర్: మండలంలోని చెన్నారానికి చెందిన ఉశన్నపై భూతగాదా విషయంలో ఐదుగురు మంగళవారం దాడి చేసినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. భూపంపకాల తగాదా విషయంలో తెల్కపల్లి మండలం రాంరెడ్డిపల్లికి చెందిన చిర్ల తిరుపతయ్య, మొల్ల శ్రీను, స్వామి, కాశమ్మ, చంద్రయ్య చెన్నారానికి వచ్చి ఉశన్న ఇంటిపై దాడి చేసి అతడిని తీవ్రంగా కొట్టడంతో గాయపడినట్లు చెప్పారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండల పరిధిలోని కొట్రకి చెందిన రాములు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంగళవారం బాధిత కుటుంబాన్ని గ్రామ సేవా సమితి అధ్యక్షుడు రవీందర్‌రావు పరామర్శించి నివాళి అర్పించారు. అనంతరం మృతుని భార్య రాధికకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

బాధితులకు పరామర్శ

లింగాల: మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు కాట్రావత్ హతిరాంనాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మంగళవారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రూ.లక్ష రుణమాఫీ చేయాలి



కల్వకుర్తి రూరల్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. 4 సంవత్సరాలు దాటుతున్నా.. రుణమాఫీ జరగకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి పాత అప్పులు కట్టలేక, కొత్త అప్పులు తెచ్చుకోలేక ఉందన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, మల్లయ్య, సిద్ధయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు సహకరిస్తాం

కల్వకుర్తి రూరల్: క్రీడా పోటీలకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని జిల్లెల్లలో నిర్వహించిన క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు అందజేశారు. చదువుతో పాటు విద్యార్థులు, యువకులు, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జంగయ్య, యాదగిరి రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేష్, శివసాయి, రాజు, రవి, ముత్యాల నరేష్, పాండు గౌడ్ పాల్గొన్నారు.

పాలకవర్గ బోర్డు ఆవిష్కరణ

తాడూరు: మండల కేంద్రంలోని నూతన గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం సర్పంచ్ యాదమ్మ, ఎంపీటీసీ రేణుక, ఉపసర్పంచ్ బుచ్చయ్య ఆధ్వర్యంలో పాలకవర్గం బోర్డు ఆవిష్కరించారు. వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి పవన్‌కుమార్ ఉన్నారు.



వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజేందర్‌గౌడ్

పెద్దకొత్తపల్లి: సాతాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ రాజేందర్‌గౌడ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు వరిధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని సూచించారు. గ్రేడ్–1 రకం క్వింటాల్‌కు రూ.2,060, గ్రేడ్–2 రకం క్వింటాల్‌కు రూ.2,040 కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సింగిల్ విండో కార్యదర్శి వెంకట్‌స్వామి గౌడ్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రారంభం

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు చేతులమీదుగా వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు



మట్టిని సేకరించే విధానం తెలుపుతున్న ఏఓ

లింగాల: భూసార పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేయడం ఎంతో లాభదాయకమని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అంబట్‌పల్లి రైతు వేదికలో వేసవి దుక్కులు, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. భూసార పరీక్షలతో ఏ పొలంలో ఎలాంటి పంటలను సాగు చేయవచ్చనేదానిని నిర్ధారించుకోవచ్చన్నారు. పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు ముఖ్యమన్నారు. ఏఈఓ శివానంద్ పాల్గొన్నారు.

కుంటను పరిశీలించిన తహసీల్దార్



కుంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

వెల్దండ: మండల పరిధిలోని కుప్పగండ్ల గ్రామ సమీపంలోని మంకమయ్య కుంటను మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌తో అధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. పట్టాభూమిలో కుంటను రైతులు తొలగిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. కుంటను ధ్వంసం చేయరాదని రైతుకు వివరించారు. మిగితా పట్టా భూమిలో పనులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ తిరుపతినాయక్, సర్వేయర్ అనసూయ, తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఉప్పునుంతల: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త అంకితభావంతో పని చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెల్టూరి రేణయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణనాయక్, ఖాదర్, రాజు తదితరులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొగిలి మహేష్, ఇన్‌చార్జ్ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికలు దగ్గరపడుతున్నందున ఒక ప్రణాళిక ప్రకారం గడపగడపకు తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు వాటి పరిష్కారం కోసం పోరాటం చేస్తూనే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు వివరించాలని సూచించారు.